# అదుగో_ అల్లదుగో....



అమరావతి చూసొద్దామని మీకూ అనిపించొచ్చు. రండి! గుంటూరు టు అమరావతి బస్సు ఎక్కేద్దాం.

జనం! జనం!

తోసుకోటం ...... గుద్దుకోటం. ముందెక్కుతున్న వాళ్ళని వెనక్కి లాగేయటం. వెనకున్న వాళ్ళని మోచేతుల్తో కుమ్మేయటం! చొక్కాలు ఫర్‌మని చిరిగిపోతున్నాయి. “ఏందయ్యా! ఆడంగుల్ని ముందెక్కనీ!” అంటూ ముందు

మగాళ్ళు ఎక్కేయటం "అమ్మో నా కాలు తొక్కేశారు. దేవుడోయ్" ఏడుపులు. "చెవులవీ చేతులవీ జాగర్తేవ్" వెనకనుంచి ముసలమ్మ అరుపులు ..... పసిపిల్లలు ఆ వొత్తిడికి కేరుమనటాలు .....

"సామాన్లు కిటికీలోంచి లోపలికి తోసెయ్ ....." ఇలా కోలాహలంగా తన్నుకుంటూ, గుద్దుకుంటూ ఒక్కొక్కళ్ళే లోపలికి చేరారు.

బస్సు బరువెక్కింది. కాలు పెట్టడానికి వీల్లేకుండా జనం కిక్కిరిసి ఉన్నారు. వాళ్ళకి తోడు శనక్కాయ మూటలు, ధనియాల బస్తాలు, కూరగాయల బుట్టలు, రేకుపెట్టెలు, పలుపుతాళ్ళు, పారలు, బాణాకర్రలు అన్నీ అందులోనే. బస్సు బరువుతో కుంగిపోతోంది. ముందుకు కదలదు. కదలటానికి డ్రైవరేడీ! కండక్టరేడీ!

లోపల ఉక్కిపోతోంది. బస్తా కుదించి మూతి కుట్టేసినట్టుంది. ఈ బాధ మళ్లించుకోటానికన్నట్టు.

"ఏందమ్మా! అంత సోటుంటే మీది మీదికి పడ్తావూ .....?

"సుట్ట తీసేవోయ్ సోగ్గాడ .... అప్పుడే ముట్టించాడు ..... దొర చుట్ట ...." అంటూ చిన్న చిన్న తగాదాలు.

ఉండగా ఉండగా చూడగా చూడగా కండక్టరు కారాకిళ్ళీ నములుతూ వచ్చాడు. వస్తూనే "ఎవరివీ బస్తాలు .... ఈ బుట్టల్దీసెయ్!" అన్నాడు. బస్తావాళ్ళు బుట్టలవాళ్ళు మాట్లాడలేదు. "మాట్లాడరేం? ఎవరివయ్యా ఇవి, బయట పారెయ్యనా?" అనేసరికి బస్‌లోంచి "మావేనయ్యా? బరువులేవు ...." అన్నారెవరో .... "ఇదేం ఎడ్లబండనుకున్నారా ... టిక్కట్టుకి డబ్బుల్దీయండి'" అంటూ టిక్కట్టు కోస్తున్నాడు. బయట పారేస్తానంటే పారేస్తానని అతని ఉద్దేశం కాదు. ఆ భావం బస్తాల వాళ్ళకీ తెలుసు. లగేజీ కొట్టేముందు అలా అరవటం ఓ లాంఛనం.

"గోరంట్లకి మూడు టిక్కట్లా? సిటీబస్‌లో పోలేవూ? దిగుదిగు" అంటున్నాడెవర్నో అట్లా అంటే దిగిపొమ్మని అర్థం కాదు. టిక్కట్టు పోగా మిగిల్చిన చిల్లర ఇవ్వనూ

అని. బస్సుకి సగం టిక్కట్లు కొట్టేడోలేదో డ్రైవరొచ్చాడు. అతనితోపాటే క్లీనరొచ్చి హారన్‌కొట్టి "గురూ! రైట్" అన్నాడు.

"టిక్కట్లు సాంతం కొయ్యలేదు. ఓనరొస్తే గొడవవుద్ది" అన్నాడు కండక్టరు.

"ఈ ట్రిప్పుకి రాడు. పేకాటలో ఉన్నాడు. వచ్చే ట్రిప్పే" అన్నాడు డ్రైవరు.

"అయితే పోనిస్తా ఉండు. తాలూకా దగ్గర ఆపు" అన్నాడు కండక్టరు.

దాంతో క్లీనరు ఆ ... ఆ... అంటూ దీర్ఘం తీసి "రైట్" అంటూ కొరడా ఝుళిపించినట్టు అనేసరికి బస్ బయలుదేరింది.

"సాంతం ఇల్లంటయ్యి పరుపులమీద కూకున్నట్టు కూకోడానికి. పదిమంది కూకునే చీటు. సర్దుగోండి" అని క్లీనర్ గదమాయించి జనాన్ని సర్దుతుంటే కండక్టరు టిక్కట్లు కోశాడు. తాలూకా కచేరీదగ్గర మళ్లీ జనం ఎక్కారు. వాళ్ళనీ సర్దాడు క్లీనర్. పుష్పకవిమానంలోలా అందరికి వేలుమోపటానికి చోటు చూపించి డ్రైవర్ వెనకాల అటో కాలు, ఇటో కాలువేసి నుంచుని డైరక్ష నిస్తున్నాడు.

ఆ డ్రైవరు అసలు డ్రైవరు కాదు. డ్రైవరు బావమర్ది. అసలు డ్రైవరుకి వొంట్లో బాగా లేకపోతే ఇతగాడొచ్చాడు.

వెనకనించి క్లీనరు "గురూ! రైటుక్కొయ్ ఎడంకి లాగుతోంది జాగర్త.... ఎనక లారీవోడొస్తున్నాడు సైడియ్ .... ముందు మేకపిల్లుంది సూస్కో ..... చింతకాయలు కొట్టుకునే ఆ పిల్లనేం జూస్తావ్. ముందు రోడ్డు చూడు బే!!" అంటూ బస్సు నడిపిస్తున్నాడు.

ఇంతలో గోరంట్ల వచ్చింది. అంటే మూడుమైళ్ళు వచ్చామన్నమాట. అక్కడ ముసలమ్మ, మూటలూ దిగాయి. అమ్మయ్య ఖాళీ వచ్చిందనుకుంటే ఇద్దరు పిల్లల తల్లి, బిందెలు ఎక్కాయి.

'ఆ... ఆ..... రైట్ "

చింతచెట్లు దాటుకుంటూ బస్ పోతోంది. బస్‌లో విత్తనాలు ..... ధరలు కబుర్లు సాగిపోతున్నాయి. కొత్తగా పెళ్ళయిన దంపతులు దూరం దూరంగా

కూర్చున్నారు. మనుషుల మధ్యనుండి తొంగి తొంగి ఒకళ్ళనొకళ్ళు చూసుకుంటూ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నారు.

"ఓల్డన్!"

బస్ ఆగింది. అడ్డ్రోడ్డు వచ్చింది. "అడ్డ్రోడ్డు దిగేవాళ్ళు తొందరగా దిగండేయ్" అని కండక్టర్ కేక "ఆ ...... ఆ.... రైట్"

లాం దాటిపోయింది.

నిడుముక్కల వెళ్ళిపోయింది.

మోతడక పొలిమేరల్లో బస్ ఆపేసి "ఇంజను ఈటెక్కింది. నీళ్ళుపొయ్యి" అని డ్రైవరు దగ్గర్లో ఉన్న గుడిసెలోకి వెళ్ళిపోయాడు. క్లీనరు నీళ్ళు పోసినా డ్రైవరింకా రాలేదు. అతగాడికి మోతడక పొలిమేరల్లో మరో సంసారం ఉంది. వాళ్ళని తాపీగా సాకి, పలకరించి మెల్లిగా వచ్చాడు. పాసింజర్లు విసుక్కున్నారు. "ఏంటయ్యా! మీరు ఇళ్ళకెళ్ళి హాయిగా ఉంటారు. మా బతుకంతా మిమ్మల్ని మొయ్యటమేగా .... రెండు మెతుకులన్నా తిననివ్వరు" అని తిరిగి విసుక్కున్నాడు డ్రైవరు.

'ఆ .... ఆ.... రైట్!'

పధ్నాలుగో మైలొచ్చింది. అక్కడ బస్సాదిలేసి కండక్టరు, డ్రైవరు, క్లీనరు కాఫీలకెళ్ళారు. 'కాఫీలు తాగేవాళ్ళుంటే తాగండి' అని జనానికి పర్మిషన్ ఇచ్చారు. మరో పావుగంట తర్వాత యండ్రాయి వచ్చింది. అక్కడ పెసల బస్తాలు వేసుకున్నాక నరుకుళ్ళపాడు వచ్చింది. నరకుళ్ళపాడు దాటి ఓ మైలు ముందుకెళ్తే కృష్ణగాలి వచ్చింది. మరో మైలురాగానే వైకుంఠపురం కొండ కన్పించింది ..... మరో అరమైలు ఉందనగా దేవాలయ గోపురం .... అదిగో శిఖరం, దీపాలదిన్నె .... ....

"అయ్యా వచ్చేశాం. మీ చేతులూ కాళ్ళూ, కీళ్ళు సమంగా ఉన్నాయో లేదో చూసుకుని మెల్లిగా దిగండి."

"ఓల్డన్" అన్నాడు క్లీనరు.*